క్లుప్తంగా

కొత్తూరు సీఐగా శంకర్‌రెడ్డి



కొత్తూరు: కొత్తూరు సీఐగా శంకర్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన బాలరాజు సనత్‌నగర్‌కు బదిలీపై వెళ్లగా రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న శంకర్‌రెడ్డి కొత్తూరుకు వచ్చారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు.

యాదవ మహాసభ మండల అధ్యక్షుడిగా చెన్నయ్యయాదవ్



చెన్నయ్యయాదవ్‌కు నియామకపత్రం అందజేస్తున్న జగదీశ్వర్‌యాదవ్

మొయినాబాద్: ఆలిండియా యాదవ మహాసభ మండల అధ్యక్షుడిగా చిలుకూరు పంచాయతీ అనుబంధ గ్రామమైన దేవల్ వెంకటాపూర్‌కు చెందిన బైకని చెన్నయ్యయాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆలిండియా యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌యాదవ్ చేతులమీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చెన్నయ్యయాదవ్ మాట్లాడుతూ.. యాదవుల ఐక్యతకు, సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్‌యాదవ్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీపతియాదవ్, నాయకులు రవీందర్‌యాదవ్, యాదగిరియాదవ్, రాజు యాదవ్ యాదయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న శంకర్

కొందుర్గు: మండల పరిధిలోని ఆగిర్యాల గ్రామానికి చెందిన చాకలి బాలమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.6వేల ఆర్థికసాయం అందజేశారు. వెంకిర్యాల గ్రామానికి చెందిన భీమయ్య పదిరోజుల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు సుధాకర్, బాల్‌రాజ్, జంగయ్య, రమేశ్, శ్రీనివాసు, జగన్, వెంకటేశ్, సీతారాం, ముబారక్ తదితరులున్నారు.

సోలార్ వీధిదీపాల ఏర్పాటు

చేవెళ్ల: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని అంగడి బజారు కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు అనంత్‌రెడ్డిని కోరారు. దీంతో ఆయన రూ.30 వేలు వెచ్చించి కాలనీలో సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దవేడులో..

షాబాద్: ప్రజలకు అనుగుణంగా గ్రామంలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు పెద్దవేడు సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం పెద్దవేడు పంచాయతీకి అనుబంధ గ్రామమైన పెద్దవేడు తండాలో ఎల్‌ఈడీ వీధి దీపాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామంలో ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు ఏర్పాటు చేసి, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉపసర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, వార్డు సభ్యులు కిషన్‌నాయక్, వెంకటన్ననాయక్, గోపాల్‌నాయక్, రఘుపతిరెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు రూ.20వేల విరాళం

చేవెళ్ల: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో బోనాల ఉత్సవాలకు చేవెళ్ల జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.మాలతి. గ్రామానికి చెందిన కావడి తిరుపతిరెడ్డి సంయుక్తంగా రూ.20వేల ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. ఆదివారం ఉత్సవాల సందర్భంగా ప్రతీ కాలనీలోని ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులకు ఈ నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. అంబేడ్కర్‌నగర్, అంగడిబజారు, భగత్‌సింగ్, సీపీఐ కాలనీ, రంగారెడ్డి కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, గడిల మైసమ్మ, పోచమ్మ గుడి తదితర ఆలయాలకు రూ.20వేల చొప్పున అందజేశారు. వారి వెంట నాయకులు వెంకటేశ్, ఎం.కృష్ణారెడ్డి, ఎం.యాదగిరి, జైపాల్‌రెడ్డి, శంకర్, వితలయ్య, చింటూ, నర్సింలు, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, జంగయ్య, దర్శన్, కృష్ణారెడ్డి, మల్లారెడ్డి తదితరులున్నారు.

వరుస చోరీలు.. జనం బెంబేలు

- బైక్‌లు.. సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్తున్న దుండగులు
- యూపీఐ ద్వారా డబ్బులు కాజేస్తున్న సైబర్ నేరగాళ్లు



మొయినాబాద్ పోలీస్‌స్టేషన్

మొయినాబాద్: పట్టణానికి చెందిన ఓ యువకుడు ఈ నెల 10న మండల కేంద్రంలో జరిగిన సంతలో కూరగాయలు కొనేందుకు వెళ్లాడు. కిందకు వంగి కూరగాయలు తీసుకుంటుండగా ప్యాంటు జేబులోని సెల్ ఫోన్‌ను గుర్తుతెలియని దుండగులు కొట్టేశారు. అదే రోజు రాత్రి మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో సెల్‌ఫోన్ పోయిందని ఫిర్యాదు చేశాడు. మంగళవారం ఉదయం అతని బ్యాంకు ఖాతాలో నుంచి యూపీఐ ద్వారా రూ.1 లక్ష ఇతరుల ఖాతాలోకి వెళ్లాయి. వెంటనే 1930 సైబర్ క్రైం కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు.

– ఢిల్లీకి చెందిన పఠాన్ అనే వ్యక్తి 20ఏళ్ల క్రితం మొయినాబాద్‌కు వలస వచ్చి కార్పెంటర్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం షాపు ఎదుట పార్కుచేసిన బైక్‌ను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. దీనిపై మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం మొయినాబాద్‌లో కొనసాగుతున్న పరిస్థితి ఇది.

మొయినాబాద్‌లో దొంగలు రెచ్చిపోతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. పోలీసులు నిఘా వైఫల్యంతోనే వరుస చోరీలు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. చోరీలు జరిగిన తరువాత బాధితులు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటంలేదని.. ఫిర్యాదు తీసుకుంటున్నారు తప్పా విచారణ చేయడంలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

వరుస దొంగతనాలు

మొయినాబాద్‌లో చోరీలు ఎక్కువయ్యాయి. వారం రోజుల క్రితం మొయినాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి పెద్దమంగళారం రోడ్డులో ఉన్న తన ఇంటి ముందు యాక్టీవా వాహనాన్ని పార్కు చేశాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో గుర్తుతెలియని దుండగులు వచ్చి వాహనం తాళం విరగొట్టి ఎత్తుకెళ్లారు. అతను ఫిర్యాదు చేశాడు. సీసీ టీవీ ఫుటేజీలు సైతం చూపించాడు. కానీ పోలీసులు ఇప్పటి వరకు ఆ దొంగలను పట్టుకోలేదు. పదిహేను రోజుల క్రితం దొంగలు ఓ వెల్డింగ్ షాపు షెటర్ తాళాలు పగులగొట్టి అందులో నుంచి రూ.3 లక్షల విలువ చేసే వెల్డింగ్, కట్టింగ్, గ్రైండింగ్ మిషన్లు ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా దొంగలు మాత్రం ఇంత వరకు చిక్కలేదు. హిమాయత్‌నగర్‌కు చెందిన ఓ యువకుని బుల్లెట్ బండిని సైతం పార్కుచేసిన చోటు నుంచి దొంగలు ఎత్తుకెళ్లారు.

ఒకే రోజు మూడు మొబైల్స్

మొయినాబాద్ మండల కేంద్రంలో ప్రతీ సోమవారం సంత(అంగడి) జరుగుతుంది. సంతకు వచ్చినవారు వస్తువులు, కూరగాయలు కొనుగోలులో ఉండగా సెల్‌ఫోన్ చోరీలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. గత సోమవారం ఒకే రోజు మూడు సెల్‌ఫోన్ చోరీలు జరిగాయి. ముగ్గురు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. అందులో ఓ యువకుడి సెల్‌ఫోన్ నుంచి మంగళవారం ఉదయం యూపీఐ ద్వారా రూ.1 లక్ష ఇతరుల ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. సోమవారం రాత్రే ఆ యువకుడు తన నెంబర్‌ను బ్లాక్ చేసి అదే నెంబర్‌పై కొత్త సిమ్‌కార్డు తీసుకున్నాడు. కానీ మంగళవారం ఉదయం అతని అకౌంట్ల నుంచి డబ్బులు ట్రాన్స్‌ఫర్ కావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. గతంలోనూ సంతలో సెల్‌ఫోన్ దొంగతనాలు చాలానే జరిగాయి. పోలీసులకు ఫిర్యాదు చేయడమే తప్పా సెల్‌ఫోన్లు రికవరీ అయిన దాఖలాలు లేవు.

నిఘా వైఫల్యం

మొయినాబాద్‌లో వరుస చోరీలకు పోలీసుల నిఘా వైఫల్యమే కారణంగా కనిపిస్తోంది. గస్తీ కాయాల్సిన పోలీసులు గాలికొదిలేశారనే విమర్శలు వస్తున్నాయి. బైక్‌ల చోరీలు వరుసగా జరుగుతున్నా క్రైం పోలీసులు సరైన రీతిలో స్పందించడంలేదు. ఫిర్యాదు తీసుకుని నెలల తరబడి విచారణ జరుపుతున్నాం అంటూ కాలయాపన చేస్తున్నారు. మరో వైపు సంతలో సెల్‌ఫోన్‌ల చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. సంతలో కొంత మంది పిల్లలు సెల్‌ఫోన్లు దొంగతనం చేసి పెద్దవాళ్లకు ఇస్తున్నట్లు.. వారి నుంచి సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి సెల్‌ఫోన్లు వెళ్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసుల నిఘా పెట్టాలి.


నిఘా పెంచుతాం

బైక్‌లను పార్కుచేసిన చోటు నుంచి దుండగులు ఎత్తుకెళ్తున్నారు. ఇటీవల జరిగిన బైక్ చోరీల్లో కొన్ని రికవరీ అయ్యాయి. మొయినాబాద్ సంతలో సెల్‌ఫోన్ చోరీలు జరుగుతున్నాయి. సెల్‌ఫోన్లు కూడా రికవరీ చేస్తున్నాం. ఈ చోరీలపైన నిఘా పెంచి చర్యలు తీసుకుంటాం.

–శిరీష, ఎస్సై, మొయినాబాద్

కూలేదాక చూస్తారా..?

మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ శివారులో జేపీ దర్గా ఆవరణలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. దర్గా దర్శనానికి వచ్చే భక్తులు ఈ ట్యాంకు పరిసరాల్లో సేద తీరుతుంటారు. ట్యాంకు పెచ్చులూడుతోంది. ఈ ట్యాంక్ కూల్చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే కూల్చివేయాలని పలువురు కోరుతున్నారు. – కొత్తూరు



పెరిగిన ధరలతో ఇబ్బందులు

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్



షాద్‌నగర్: నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న బాల్‌రాజ్‌గౌడ్

షాద్‌నగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేయాలని షాద్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని చింతగూడ గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ బీసీ, ఎస్సీ సెల్ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడుతూ... బీజేపీ, బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు విసిగిపోయారని ఆరోపించారు. పెరిగిన ధరలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సెల్ అధ్యక్షుడిగా రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యాదయ్య, ఉపాధ్యక్షుడిగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌లను ఎన్నుకున్నారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అశోక్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా బచ్చలి వెంకటయ్యను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బసప్ప, సాయిలు, మహేశ్, రమేష్, రాజు, శ్రీనివాసులు, రవి, మల్లారెడ్డి, అశోక్, శ్రీశైలం, వెంకటేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కాశిరెడ్డిగూడ గ్రామ కమిటీ నియామకం

మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మాధవరెడ్డి, ఉపాధ్యక్షులుగా దాసరి సంతోశ్‌కుమార్, రాఘవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మల్లేశ్, సహాయ కార్యదర్శిగా శేఖర్‌రెడ్డి, కోశాధికారి రమేశ్, సభ్యులుగా పాతపల్లి ప్రభాకర్‌రెడ్డి, వెంకటరెడ్డిని ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు దేవగిరి నవీన్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

జెడ్పీవైస్ ఛైర్మన్ ఈట గణేశ్

నందిగామ: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీవైస్ ఛైర్మన్ ఈట గణేశ్ అన్నారు. పంచాయితీ పరిధిలోని బండ కుంట తండాలో ఆదివారం జెడ్పీవైస్ ఛైర్మన్ రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తండా వాసులు ప్రతీ నెల రేషన్ సరుకులు తీసుకునేందుకు కిలో మీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లి ఇబ్బంది పడే వారని.. గిరిజనుల సమస్యను సర్పంచ్ వెంకట్‌రెడ్డి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే తండాకు రేషన్ షాపును కేటాయించారన్నారు. ఇప్పటి నుంచి ప్రతీ నెల రేషన్ సరుకులు తండాలోనే తీసుకోవచ్చని తండావాసులకు ఆయన సూచించారు.



రేషన్ షాపును ప్రారంభిస్తున్న గణేశ్

రేషన్ షాపు ఏర్పాటు చేయడంపై గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ కుమార్‌గౌడ్, తండా వాసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యం



నాగర్‌గూడలో కాంగ్రెస్ నాయకులు

టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు భీంభరత్

షాబాద్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కలను సాకారం చేసిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవడానికి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు పామెన భీంభరత్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పీఎస్‌ఆర్ గార్డెన్‌లో టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడిగా ఎన్నికైన పామెన భీంభరత్‌ను షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్, నవాబ్‌పేట్ మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సన్మాన సభ నిర్వహించారు. నాగర్‌గూడలో భారీగా ర్యాలీ నిర్వహించి అంబేద్కర్, జ్యోతిరావు పూలే, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు కాంగ్రెస్‌కు పట్టుగొమ్మలన్నారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, నిరుద్యోగ భృతి, పింఛన్లు రూ.4,016 వంటి పథకాలు అమలు కావాలంటే ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలు నచ్చక వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. దేశంలో, రాష్ట్రంలో సుపరిపాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని వివరించారు. టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ ఛైర్మన్ చింపుల సత్యనారాయణరెడ్డి, టీపీసీ ఉపాధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ్‌రామ్, నియోజకవర్గం యువజన అధ్యక్షుడు పెంటారెడ్డి, పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్, పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ఎ–బ్లాక్ మాజీ అధ్యక్షుడు ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యులు చెన్నయ్య, అశోక్, నాయకులు రషీద్‌పటేల్, అక్తర్ పాషా, యాదయ్య, చంద్రయ్య, మాణయ్య, చెన్నయ్య, బుచ్చయ్య, జాకీర్‌షరీఫ్, నర్సింహులు, బాల్‌రాజ్, వెంకటేశ్, మల్లేశ్, మహేశ్, రవికుమార్ తదితరులున్నారు.



చేవెళ్ల: హౌసింగ్‌బోర్డు కాలనీలో పోతురాజుల నృత్యాలు

పసుపు.. కుంకుమ.. బోనం

- గ్రామ దేవతలకు మొక్కులు తీర్చుకున్న భక్తులు
- సందడిగా మారిన పల్లెలు

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో బోనాలు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేప మండలను గుమ్మాలకు కట్టి.. గడపలకు పసుపు, కుండలకు కుంకుమ బొట్లను అలంకరించారు. మహిళలు నూతన వస్త్రాలు ధరించి బోనాలు ఎత్తుకుని అమ్మవారి ఆలయాలకు బారులు తీరారు. నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, శివ సత్తుల పూనకాల నడుమ ఆయా గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. – సాక్షి, నెట్‌వర్క్



కొందుర్గు: జిల్లేడ్‌లో బోనాల ఊరేగింపు



చేవెళ్ల: ఆలూరులో..



షాద్‌నగర్: ప్రత్యేక పూజలో తాండ్ర విశాల, నాయకులు



చేవెళ్ల: బోనమెత్తిన మహిళలు



మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్‌లో బోనాల ఊరేగింపు



మొయినాబాద్: అప్పోజీగూడలో..



నందిగామ: బోనాల ఊరేగింపులో పాల్గొన్న నాయకులు

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమిద్దాం

మాదాసి కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాములు

షాద్‌నగర్: సమస్యల సాధనకు మాదాసి కురుమలందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్తి శివరాములు అన్నారు. పట్టణ పరిధిలో ఉన్న గాంధీనగర్ కాలనీలోని ఉన్న సహకార సంఘ భవనంలో ఆదివారం కురుమ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శివరాములు మాట్లాడుతూ.. మాదాసి కురుమల ఆర్థిక, సామాజిక, రాజకీయ విద్యా రంగాల్లో రాణిస్తేనే సమస్యలు పరిష్కరించబడుతాయన్నారు. మాదాసి కురుమలకు ఎస్సీ ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్నా ప్రభుత్వం సందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మనమంత కలిసికట్టుగా ఉంటూ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని సూచించారు. అనంతరం సంఘం తాలుకా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిందం వితలయ్య, గౌరవాధ్యక్షులుగా బండ వెంకటేశ్, నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మయ్య, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి శ్రీనివాసులు, సత్తయ్య, మల్లేశ్, కుమార్, జంగయ్య, అర్జున్, శివలింగం, శ్రీను, లక్ష్మయ్య, మల్లేశ్, రాములు, సత్యనారాయణ, రాజు, శివ కుమార్, సత్తయ్య, బీరప్ప పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

దళితుడిపై దాడి అవాస్తవం

- ఉద్దేశపూర్వకంగానే విద్వేశాలు రెచ్చగొడుతున్నారు
- ఏసీపీకి వివరించిన మల్కాపూర్ వాసులు

చేవెళ్ల: మల్కాపూర్‌లో సర్పంచ్ అనుచరులు ఓ దళిత వ్యక్తిపై దాడి చేసి కులం పేరి ట దూషించినట్లు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని.. రాజకీయ కక్షలతోనే ఫిర్యాదు చేశారని గ్రామస్తులు పోలీసులకు వివరించారు. ఆదివారం గ్రామానికి చెందిన అన్ని వర్గాల ప్రజలు చేవెళ్ల ఏసీపీ, సీఐను కలిశారు. బోనాల ఉత్సవాల సందర్భంగా గ్రామానికి చెందిన సంజీవ ఊరేగింపులో డ్యాన్స్ చేస్తూ ఇబ్బంది కలిగించాడు. దీంతో అతన్ని నిలువరిస్తుండగా స్వల్ప తోపులాట జరిగింది.. దీంతో ఆ వ్యక్తికి గ్రామస్తులు సర్ది చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లి పోయాడు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సర్పంచ్ శేరి శివారెడ్డి రాజకీయ భవిష్యత్‌ను దెబ్బతీసేందుకు సంజీవతో ఫిర్యాదు చేయించారని దళిత వర్గానికి చెందిన వారు పోలీసులకు వివరించారు.

పరామర్శించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

సంజీవపై దాడి జరిగిందని సమాచారం అందుకు మహాజన్ సోషలిస్టు పార్టీ నాయుడు మద్దిలేటి క్యాసారం శంకర్‌రావు, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ నర్సింహ, నియోజకవర్గ కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం బాధితుడిని పరామర్శించి విషయం తెలుసుకున్నారు. దళితులపై దాడులు చేయడం హేయనీయమన్నారు. పోలీసులు, ప్రజాప్రతినిధులు స్పందించి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాదిత కుటుంబానికి ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందన్నారు. దాడిచేసిన వారిని అరెస్ట్ చేయకపోతే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పీఎస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పెంటయ్య, వెంకటేశ్, లక్ష్మయ్య, నర్సింలు, రవి, శేఖర్ తదితరులున్నారు.